క్లుప్తంగా

ఎంపీని కలిసిన వైఈపీ రెడ్డి



ప్రొద్దుటూరు : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాదరెడ్డి ఆదివారం కలిశారు. పోట్లదుర్తి అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఎంపీని ఆయన కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పుల్లయ్యతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : స్థానిక వినాయక నగర్‌లోని ప్రముఖ వ్యాపార వేత్త పట్టుపోగుల పుల్లయ్యను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పట్టుపోగుల పుల్లయ్యను.. ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పద్మశాలీయ సేవా సంఘం పట్టణాధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు, కౌన్సిలర్ పిట్టా బాలాజీ, వ్యాపారవేత్త కడప రామిశెట్టి పాల్గొన్నారు.

చాపాడు ఎంపీడీఓ చిత్తూరుకు బదిలీ

చాపాడు : చాపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కేవీ శ్రీధర్‌నాయుడు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకూ పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల క్రితం మండల అడ్మినిస్ట్రేషన్ అధికారిగా ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌నాయుడు ఏడాది క్రితం ఎంపీడీఓగా పదోన్నతిపై బాధ్యతలు కొనసాగిస్తున్నారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయ్యారు.

శ్మశానవాటిక దారి సమస్యను పరిష్కరిస్తాం



20వ వార్డులో శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధి 20వ వార్డులోని బాకరాపేట శ్మశానవాటిక రహదారి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వార్డులోని శ్మశానవాటిక దారి సమస్యను స్థానిక ప్రజలు చైర్మన్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన ఆదివారం సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శ్మశానవాటికకు వెళ్లే రహదారి, ప్రహరీగోడ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులతో మాట్లాడి అంచనాలు సిద్ధం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ గాజులపల్లె కేశవరెడ్డి, వార్డు ఇన్‌చార్జి చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



లంకమల అభయారణ్యంలో నేచర్‌క్యాంప్‌నకు హాజరైన విద్యార్థులు

బద్వేలు అర్బన్ : పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకటశేషయ్య తెలిపారు. జిల్లా అటవీ అధికారి పీవీ.సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో లంకమల అభయారణ్యంలో నేచర్‌క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో సంభవిస్తున్న అనేక రకాల మార్పులకు ముఖ్య కారణం చెట్లు అంతరించి పోతుండటమేనని ఇటీవల కాలంలో అధ్యయనాలు తెలుపుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ అడవులను సంరక్షించాలని కోరారు. వన్యప్రాణులను కూడా సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో రాజేష్‌రెడ్డి, ఏబీవో షాజహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, జిల్లా కార్యదర్శి కట్టా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు సంక్షేమ పాలన

ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి



ముదుమాలలో ఆర్బీకే నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : ప్రజల వద్దకు సంక్షేమ పాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరువ చేశారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం వరకు మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా మల్లేపల్లెలో నూతన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ముదుమాల పంచాయతీలో ఆర్బీకే, ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభించారు. మలుగుడు పాడు గ్రామంలో ఫ్లోరైడ్ నివారణకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను, నాగిశెట్టిపల్లెలో, రేకులకుంటలో గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభించారు. అనంతరం సచివాలయాల కన్వీనర్ కూన పులి రాజానాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబకు సంక్షేమ ఫలాలను అందించిందన్నారు. పార్టీలకు, కులాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించిన ముఖ్యమంత్రిని మరోమారు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, వైఎస్సార్ సీసీ అధ్యక్షుడు మండల మేకల రత్నకుమార్‌యాదవ్, సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బిరెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు సి.నాగేశ్వర్‌రెడ్డి పీఆర్ డీఈఈ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, వెలుగు ఏపీఎం ప్రకాశం, మల్లేపల్లె సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ సి.కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమణ, ముదుమాల సర్పంచ్ శీలం లక్ష్మీదేవి, పెద్దిరెడ్డి, శీలం రామగురివిరెడ్డి, నరసింహులు, మలుగుడు పాడు సుబ్బరామిరెడ్డి, సర్పంచ్ అనంతరెడ్డి, రేకలకుంట సర్పంచ్ నాగిపోగు జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

మండల పర్యటనలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రఖ్యాత నీలకంఠేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అలాగే రేకలకుంట గ్రామంలోని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

హామీ నెరవేర్చాం

చాపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకూ నాలుగో విడతల్లో డ్వాక్రా రుణాలను మాఫీ చేశారు. ఈ మేరకూ మండలంలోని 7335 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.5.35కోట్ల రుణ మాఫీ నిధులను తమ ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసింది. ఈ క్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సోమవారం స్థానిక వైఎస్ కళ్యాణ మండపంలో రుణమాఫీ చెక్కులను ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు డ్వాక్రా ఏపీఎం వెంకటరమణ తెలిపారు. ఉదయం 9గంటలకు జరుగనున్న కార్యక్రమానికి డ్వాక్రా మహిళలతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఏపీఎం కోరారు.

సుమతీ శతకానికి ప్రత్యేక స్థానం



బద్దెన కవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి

బద్వేలు అర్బన్ : తెలుగు సాహిత్యంలో శతకాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంటే.. అందులో బద్దెన కవి రచించిన సుమతీ శతకానికి మరింత ప్రత్యేక స్థానం ఉందని హంస అవార్డు గ్రహీత, ప్రముఖ అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బద్దెన కవి విగ్రహాన్ని ఆదివారం డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్దెన కవి తన సుమతీ శతకం ద్వారా సరళమైన చిన్న పద్యాలలో చెప్పిన నీతులు తెలుగు వారి జీవితంలోను, తెలుగు భాషలోనూ భాగాలైపోయాయన్నారు. డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులకు చదువుతో పాటు సాహిత్యం, ఆధ్యాత్మికత జోడించి నైతిక విలువలు పెంపొందించే విధంగా విద్యాబోధన ఉండాలన్నారు. కార్యక్రమంలో కవులు ఎలమర్తి మధుసూదన్, రమణ, టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యులు మూలె రామమునిరెడ్డి, వైవీయూ పాలకమండలి సభ్యులు కొండపల్లి సుబ్బారావు, బద్దెన కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు గంగసాని సాంబశివారెడ్డి, శంభూప్రసాద్ పలు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

ప్రొద్దుటూరు : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గీతాంజలి స్కూల్‌లో మహాసభ నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించిన అనంతరం సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 1996లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయగా, ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2009లో అప్పటి సీఎం వైఎస్ వైఎస్ రాజశేఖరరెడ్డి భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. ఈ బోర్డు ద్వారా 22 లక్షల మంది కార్మికులు గుర్తింపు కార్డులను తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, మాజీ జిల్లా కార్యదర్శి బి.రామయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంజుల, యూనియన్ నాయకులు చిన్న ఓబున్న, లింగన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

రాయలసీమ ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

ప్రొద్దుటూరు : రాయలసీమ ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, సీమలో ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక గీతాశ్రమంలో శారద జూనియర్ కాలేజీలో 'రాయలసీమ సమగ్రాభివృద్ధి – రాజకీయ పార్టీల తీరు'అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టులకు ఉపయోగపడే సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని కోరారు. రాష్ట్ర విభజన హామీల మేరకు కర్నూలులో హైకోర్టు చేయాలని, కడప స్టీల్‌ప్లాంట్ నిర్మాణం, గుంతకల్లులో రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, రాయలసీమలో జాతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ, నియోజకవర్గ అధ్యక్షుడు ఆవుల రఘురాముడు, న్యాయ విద్యార్థి యూనియన్ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'ను జయప్రదం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను పల్లెకు పోదాం బీజేపీ పేరుతో ప్రతి ఇంటికి వెళ్లి వివరించే కార్యక్రమాన్ని చేపట్టామని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో వివిధ రంగాలలో సేవా కార్యక్రమాలు చేసిన వారిని గౌరవించడం లాంటి కార్యక్రమాలు కూడా గ్రామ స్థాయిలో చేయాలని నిర్ణయించామన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా నాయకత్వంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సూచన మేరకు పల్లెకు పోదాం అనే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జి బాలకృష్ణ యాదవ్, జిల్లా కన్వీనర్ కేవీ లక్ష్మినారాయణరెడ్డి, మాజీ శాసనసభ్యులు జయరాములు, గాలి హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమృతానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి



రిలే దీక్షలో సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

ప్రొద్దుటూరు : అమృతానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం 2008, 2018లో పేదలకు అమృతానగర్‌లో ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. పేదల స్థలాలకు కొందరు నకిలీ పత్రాలు సృష్టించి ఇతరులకు అమ్ముకుంటున్నారన్నారు. ఈ సమస్యపై సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆందోళనలో లబ్ధిదారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రిలే దీక్షలో హసీనా, రాములమ్మ, అంజి, రఫి, ఫాతిమా, ఐద్వా జిల్లా ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం నగర శివారులోని ఊటుకూరు జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీటీసీ ఈ.మీరాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వాహన డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధ్యానంతో రుగ్మతలు దూరం



మాట్లాడుతున్న దేవకీ మాతాజీ



ఓం మండలి సంస్థ నాయకులు, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : నిత్యం ధ్యాన సాధన చేయడం ద్వారా మానసిక, శారీరక రుగ్మతలు తొలగిపోతాయని ఓం మండలి శివశక్తి అవతార్ సేవా సంస్థాన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు దేవకీ మాతాజీ పేర్కొన్నారు. స్థానిక వసంతపేటలోని శ్రీ చౌడేశ్వరిదేవి తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం ఓం మండలి శివశక్తి అవతార్ సేవాసంస్థాన్ ఆధ్వర్యంలో శివ భోలానాథుని సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ నిత్యజీవితంలో క్రమం తప్పకుండా ఓంకార ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడిని తొలగించుకుని ప్రశాంతంగా జీవించవచ్చన్నారు. ఏకాగ్రతతో సవాళ్లను సులభంగా జయించవచ్చని పేర్కొన్నారు. జీవహింస మహాపాపమని, మాంసాహారం భుజించరాదని, శాఖాహారం తీసుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో మానవుడు యాంత్రిక జీవనం గడుపుతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడన్నారు. ధ్యానం ద్వారా మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని, తోటివారి పట్ల గౌరవంగా ప్రవర్తించాలన్నారు. చెడుగుణాలను వదలి సన్మార్గంలో నడవాలని, సమాజంలో సహృద్భావ వాతావరణాన్ని తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. సమావేశం అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఓం మండలి సంస్థ జాతీయ నాయకులు ద్వారకా దేవ్, విజయ్ దేవ్, అంజనాదేవి, స్థానిక నాయకులు అవ్వారు సుబ్బరామయ్య, ఉప్పల వెంకటరమణ, లీలావతి దేవి, శివకుమారి, తిరుపతిదేవ్, మల్లికార్జున, భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల డిమాండ్లు నెరవేర్చాలి



ధర్నా కరపత్రాలు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మున్సిపల్ టీచర్ల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఫిబ్రవరి 1న కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా ఎంఈఓలను, ఉప విద్యాశాఖాధికారులను నియమించాలని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పాఠశాలలను ఏర్పాటు చేయాలన్న ప్రధాన డిమాండ్లతో ధర్నా చేయనున్నామని చెప్పారు. ఈ ధర్నాకు జిల్లాలోని మున్సిపల్ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, పట్టణాధ్యక్షుడు కొండారెడ్డి, జిల్లా కౌన్సిలర్లు నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు, బాబుల్‌రెడ్డి, నాగిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నల్లనమ్మ ఆలయ వార్షికోత్సవాలు

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లెలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు నల్లనమ్మ ఆలయ నాలుగవ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం 5గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు 400లడుగులు ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు, మంగళవారం ఉదయం 10 గంటలకు అమ్మవారికి బోనాల సమర్పణ, కుంకుమార్చన తదుపరి కీర్తిపల్లె గ్రామానికి చెందిన ఆడబిడ్డలకు వడిబియ్యం కార్యక్రమం, మధ్యాహ్నం 2 గంటలకు నల్లనమ్మ తల్లి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండం ప్రవేశం, రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో చెక్కభజన కార్యక్రమం, బుధవారం ఉదయం 8 గంటలకు న్యూకేటగిరికి చెందిన వృషభరాజములచే బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ప్రథమ రూ.50వేలు, ద్వితీయ రూ.40వేలు, తృతీయ రూ. 30వేలు ఉంటుందన్నారు. భక్తులకు మూడు రోజులు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రామభక్తుల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరావు

ప్రొద్దుటూరు కల్చరల్ : అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ చేరవేయడంలో రామసేవకులు, భక్తుల సేవలు అభినందనీయమని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చీతిరాల నాగార్జునరావు పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఆదివారం అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామ గ్రామం, వాడవాడలా తిరిగి ప్రజలకు శ్రీరాముని అక్షింతలు అందించిన రామ భక్తులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనవరి 1 నుంచి ఇంటింటికీ భక్తులు శ్రీరాముని అక్షింతలు చేర్చారన్నారు. విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ విభాగ్ సంపర్క్ ప్రముఖ్ మారెళ్ల మల్లికార్జునరావు, వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, విజయకుమార్, నగర అధ్యక్షుడు నాగమునిరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు, కాల్వ చలపతి, గ్రామ సేవకులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి

కడప కార్పొరేషన్ : విద్యుత్ సంస్థలలో పని చేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు రామలింగారెడ్డి డిమాండ్ చేశారు. కడప నగరంలోని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అదనపు కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఈశ్వరయ్య, నాగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, జయక్రిష్ణారెడ్డి, నాగరత్న ఆచారి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అప్పుడే వారు మానసికంగా ఉల్లాసంగా ఉంటారని మాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి, చెస్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగర శివార్లలోని మాంటిస్సోరి జగతి ఇంటర్నేషల్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు జరిగాయి. విజయవాడ, గుంటూరు, అనంతపురం, తిరుపతి, వైఎస్సార్ జిల్లాల నుంచి 198 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో అనంతపురానికి చెందిన కుషాల్ నిలువగా, రెండవ స్థానంలో తిరుపతికి చెందిన వెలుగోటి యాతిన్‌రెడ్డి, మూడవ స్థానంలో అనంతపురానికి చెందిన వెంకటరమణ నిలిచారు. విజేతలకు మాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి లక్ష రూపాయల ప్రైజ్ మనీతోపాటు కప్పులను అందజేశారు. అలాగే పోటీలలో పాల్గొన్న అందరికి మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, చెస్ అసోసియేషన్ ప్రతినిధులు నాగార్జున, ఫణికుమార్, సుదర్శన్‌రెడ్డి, హిమ్మత్, సురేంద్ర, రాయుడు, మాధవి, తేజశ్రీ, అనంత్‌తోపాటు మాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడిజిల్లాలో ప్రాక్టికల్ పేరుతో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయని, అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలకు చెందిన యాజమాన్యాలు ప్రాక్టికల్స్‌లో మార్కులు వేయిస్తామని మాయ మాటలు చెప్పి విద్యార్థుల నుంచి 1500 నుంచి 2 వేల వరకు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.